సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 5 । ఫిబ్రవరి । 2024



'సూక్ష్మ'సేద్యం.. రైతుకు భాగ్యం

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా తోడుగా నిలుస్తోంది. సబ్సిడీపై బిందు, తుంపర పరికరాలు అందజేస్తోంది. 8లో



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.8°/ 15.4°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'



పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం, ధర్మవరం, కదిరి ఆర్డీఓ కార్యాలయాలు, మండల స్థాయిలోనూ ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వినతి పత్రాలపై ఆధార్, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా పొందుపరచాలన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం 'స్పందన' నిర్వహిస్తున్నట్లు పోలీసు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజలు తమ సమస్యలపై ఎస్పీ మాధవరెడ్డికి నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చు.

పింఛన్ల పంపిణీ 98.2 శాతం పూర్తి

- నేటితో ముగియనున్న కార్యక్రమం



అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఆదివారం నాటికి 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ 98.2 శాతం పూర్తయింది. 32 మండలాల పరిధిలోని 2,74,578 మంది లబ్ధిదారులకు రూ.81,95,62,500 మంజూరైంది. వలంటీర్లు నాలుగు రోజుల్లోనే 2,69,596 మందికి రూ.80,46,01,500 మొత్తాన్ని పంపిణీ పూర్తి చేశారు. పింఛన్ పంపిణీలో రాష్ట్రంలోనే జిల్లా 9వ స్థానంలో నిలిచిందని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. సోమవారం సాయంత్రానికి కార్యక్రమం పూర్తి కానుందన్నారు.

10 వరకు 'తత్కాల్' కింద ఇంటర్ ఫీజు చెల్లించొచ్చు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ విద్యార్థులు, ఫెయిలైన విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు తత్కాల్ స్కీం కింద ఈ నెల 10 వరకు గడువు పొడిగించారు. ఈ మేరకు ఇంటర్మీడియెట్ బోర్డు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. తత్కాల్ స్కీం కింద రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుందని ఇంటర్ పరీక్షల అనంతపురం జిల్లా కన్వీనర్ వెంకటరమణ నాయక్ తెలిపారు. పదో తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువు ఉందని పేర్కొన్నారు. ఇంకా ఎవరైనా ఫీజు చెల్లించని ఫస్టియర్ జనరల్ విద్యార్థులతో పాటు ఒకేషనల్ విద్యార్థులు, ఫెయిలైన విద్యార్థులు ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తహసీల్దార్ల నియామకం



పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని తహసీల్దార్లను బదిలీ చేసిన ప్రభుత్వం వారి స్థానాల్లో ఆయా మండలాలకు కొత్తవారిని నియమించింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు విడుదల చేసింది. హమీద్ బాష (సీకేపల్లి), వెంకటేశ్వర్లు (మడకశిర), ప్రతాప్‌రెడ్డి (గుడిబండ), భద్రుజమ (రొళ్ల), వెంకటసుబ్బయ్య (అమరాపురం), శివప్రసాద్‌రెడ్డి (హిందూపురం), భాగ్యలత (చిలమత్తూరు), బాలనరసింహులు (లేపాక్షి), ఉదయ్ శంకర్ రాజు (పెనుకొండ), వసుంధర (పరిగి), లక్ష్మీనారాయణ (రొద్దం), అంజనాదేవి (సోమందేపల్లి),అక్బల్‌బాష(గోరంట్ల), వేణుగోపాల్ (పుట్టపర్తి), కళావతి (కొత్తచెరువు), భారతి (పుట్టపర్తి కలెక్టరేట్), నాగభూషణం (నల్లమాడ),ఖాజాబి(ఓడీ చెరువు), రమేష్ (ధర్మవరం), నజ్మాభాను (తాడిమర్రి), సరస్వతి (ముదిగుబ్బ), శివశంకర్ నాయక్ (బత్తలపల్లి), రామనాథరెడ్డి (కదిరి), రామకుమారి (తలుపుల),శ్రావణి (కలెక్టరేట్), శ్రీనివాసులు (కలెక్టరేట్), వెంకటస్వామి (ఆర్డీఓ ఆఫీస్, పుట్టపర్తి), రామాంజనేయరెడ్డి (కలెక్టరేట్), అన్వర్ హుస్సేన్ (కలెక్టరేట్), బాబు (కదిరి ఆర్డీఓ ఆఫీస్), రమేష్‌బాబు (ఆర్డీఓ ఆఫీస్, ధర్మవరం) రానున్నారు.

- **పుట్టపర్తి** శివారులో ఇటీవల ప్రారంభమైన ఓ హోటల్‌కు 3 రోజుల క్రితం తమ చిన్నారి పుట్టిన రోజు సందర్భంగా కుటుంబ సభ్యులు వెళ్లారు. పలు వంటకాలు ఆర్డర్ చేసి తిన్నారు. రుచికరంగా లేవని హోటల్ నిర్వాహకులకు చెబితే.. మాట్లాడే సమయం లేదు, బిల్లు కట్టి వెళ్లాలంటూ దబాయించారు. తీరా ఇంటికెళ్లిన తర్వాత అందరూ అస్వస్థతకు గురయ్యారు. వాంతులు చేసుకున్నారు.
- **హిందూపురం** బస్టాండు పక్కనే ఉన్న హోటల్‌లో నాలుగు రోజుల క్రితం ఇద్దరు స్నేహితులు భోజనం చేశారు. అన్నం సరిగా ఉడకలేదని అక్కడి సిబ్బందికి చెబితే... ఇప్పుడే చేశాం, అలాగే ఉంటుందని సమాధానమిచ్చారు. దీంతో చేసేదిలేక స్నేహితులు తిన్నారు. ఇంటికెళ్లాక విరేచనాలు ప్రారంభమయ్యాయి. సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికెళ్లి వైద్య చికిత్సలు పొందాక కాస్త ఉపశమనం లభించింది.



కళ్లకు ఇంపు.. తింటే ముప్పు!

- చాలా హోటళ్లు, రెస్టారెంట్లలో కల్తీ వంటకాలు
- రోజుల తరబడి నిల్వ
- వాటినే వినియోగదారులకు వడ్డింపు
- వాంతులు, విరేచనాలతో బాధితుల ఆస్పత్రులపాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

సాక్షి, పుట్టపర్తి:

చూడచక్కనైన బోర్డులు పెట్టి ఆకర్షిస్తారు. పసందైన వంటకాల మెనూతో నోరూరిస్తారు. లోపలికి వెళ్లగానే ఘుమఘుమలాడే వాసనలతో మైమరిపింపచేస్తారు. అన్నీ ఫ్రెష్‌వే అంటూ వడ్డించేస్తారు. కానీ, తిన్నాకే తెలుస్తుంది. మన కళ్లు మనల్ని ఎంతలా మోసం చేశాయో!. ఆస్పత్రికెళ్లి వైద్య చికిత్సలు పొందాకే అర్థం అవుతుంది.. ఆ హోటల్‌కి వెళ్లి ఎంతపెద్ద తప్పు చేశామో!.

కల్తీతో కల్లోలం..

జిల్లా వ్యాప్తంగా పలు రెస్టారెంట్లు, హోటళ్లలో కల్తీ ఆహారం వీరవిహారం చేస్తోంది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతోంది. రుచికరంగా ఉండేందుకు ఏవి పడితే అవి కలిపేయడం తిన్న వారి ప్రాణాల మీదికొస్తోంది. మరోవైపు నిల్వ ఉంచి వడ్డిస్తున్న వంటకాల ప్రభావం తక్షణమే కనిపిస్తోంది. ఫుడ్ పాయిజన్‌తో ఆస్పత్రులబాట పడుతున్న బాధితుల సంఖ్య ఇటీవల పెరిగిపోయింది.

తప్పక తింటూ.. తిప్పలు ఎదుర్కొంటూ..

మారిన జీవనశైలిలో భాగంగా చాలామంది హోటళ్లలో తినడానికి అలవాటుపడ్డారు. దీంతో రెస్టారెంట్లు, హోటళ్ల నిర్వాహకులు ఉదయంపూట ఒకేసారి వందల మందికి సరిపడా వంటకాలు తయారు చేసి ఉంచుతున్నారు. కస్టమర్లు ఇచ్చే ఆర్డర్ల ఆధారంగా అప్పటికప్పుడు మరోసారి వేడి చేసి ఇస్తున్నారు. అమ్ముడు పోకుండా మిగిలిపోతే ఫ్రిడ్జ్‌లో ఉంచి మరుసటి రోజు అంటగడుతున్నారు. చుక్కలు చూపుతున్నారు.

ప్రశ్నిస్తే దౌర్జన్యం..

చాలా హోటళ్లలో ఆహారం తిన్నాక బిల్లులు ఇవ్వడం లేదు. తెల్ల కాగితాలపై రాసి పంపిస్తున్నారు. మరుసటి రోజు కస్టమర్లు గొడవకు దిగినా.. మా హోటల్‌లో తినలేదంటూ దబాయిస్తున్నారు. తినే సమయంలోనూ ఆహారం బాగుండటం లేదని ప్రశ్నించినా హోటల్ నిర్వాహకులు తిరగబడుతున్నారు. బిల్లు ఇచ్చేది లేదు.. డబ్బు కట్టి వెళ్లాలని దౌర్జన్యం చేస్తున్నారు.

తూతూమంత్రపు చర్యలతో సరి..!

కల్తీ హోటళ్లపై అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. తూతూమంత్రపు తనిఖీలతో ఫుడ్ సేఫ్టీ అధికారులు సరిపెడుతున్నారు. ప్రజలకు అవగాహన కల్పించడంలో కూడా విఫలమవుతున్నారు. దీంతో చాలామంది ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలీక మిన్నకుండిపోతున్నారు. ఇదే అదనుగా హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు మరింత రెచ్చిపోతున్నారు. మీకు ఇష్టం వచ్చిన వాళ్లకు ఫిర్యాదు చేసుకోవాలంటూ రుబాబు చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



ప్రతి నెలా మాకు విధించిన లక్ష్యం మేరకు తనిఖీలు చేస్తున్నాం. ఎలాంటి ఫిర్యాదు వచ్చినా.. ఆయా ప్రాంతాలకు వెళ్లి తనిఖీ చేసి శ్యాంపిళ్లు తీసుకుని ల్యాబ్‌కు పంపిస్తున్నాం. రిపోర్టులు వచ్చిన తర్వాత చర్యలకు ఆదేశిస్తున్నాం. కల్తీ ఆహారం, నిల్వ ఉంచిన ఆహారం వడ్డించే హోటళ్లపై ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

– రామచంద్ర, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి దీన

పెనుకొండ: స్థానిక సబ్ జైలును ఆదివారం ఉదయం ఉమ్మడి జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి, న్యాయమూర్తి దీన సందర్శించారు. బాల నేరస్తులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ.. వారి బాగోగులు, సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ అజ్గర్ హుస్సేన్, న్యాయవాది మోహన్‌నాయక్, పారా లీగల్ వలంటీర్ నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదని ఆత్మహత్యాయత్నం

ఉరవకొండ: మండలంలోని ఆమిద్యాల గ్రామంలో ఓ ప్రేమజంట ఆత్మహత్యాయత్నం ఘటన కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన మేరకు... ఆమిద్యాలకు చెందిన రవి, రోజా ఎనిమిదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబపెద్దలు వీరి ప్రేమను అంగీకరించకపోవడంతో ఇద్దరూ పారిపోయి పెళ్లి చేసుకోవాలనుకున్నారు. దీంతో అప్రమత్తమైన కుటుంబపెద్దలు ఇద్దరికీ వేర్వేరు వ్యక్తులతో వివాహం చేశారు. ఈ క్రమంలో కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన యువకుడిని పెళ్లి చేసుకున్న రోజా... ఏడు నెలల క్రితం భర్తతో ఘర్షణ పడి పుట్టింటికి చేరుకుంది. రాజాను ఎలాగైనా పెళ్లి చేసుకోవాలనుకున్న ఆమె ఆ మేరకు విశ్వ ప్రయత్నాలు చేసింది. ఈ నేపథ్యంలోనే తాము పెళ్లి చేసుకున్నా..కుటుంబ పెద్దలు తమను ప్రశాంతంగా జీవనం సాగనివ్వరని భయపడిన ఇద్దరూ ఆదివారం ఉదయం గ్రామ శివారులోని పొలానికి చేరుకుని పురుగుల మందు తాగారు. అపస్మారక స్థితికి చేరుకున్న ప్రేమజంటను అటుగా వెళ్లిన కూలీలు గమనించి 108 అంబులెన్స్ ద్వారా తొలుత ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనపై సీఐ తిమ్మయ్య మాట్లాడుతూ.. తమకు ఇప్పటి వరకూ ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. ఘటనకు సంబంధించి బాధితులు ఫిర్యాదు చేస్తే ఇద్దరి స్టేట్‌మెంట్ రికార్డు చేసి వివరాలు వెల్లడిస్తామన్నారు.

'సిద్ధం' సభకు స్థల పరిశీలన



రాప్తాడులో స్థలాన్ని పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంటు సమన్వయకర్త శాంతమ్మ తదితరులు

రాప్తాడు: ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ శ్రేణులను సన్నద్ధం చేయడానికి రాప్తాడులో ఈ నెల 10న నిర్వహించే బహిరంగ సభకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. బహిరంగ సభ కోసం ఆదివారం సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్/ ఎమ్మెల్సీ తలశిల రఘురాం.. ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరి సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంటు సమన్వయకర్త శాంతమ్మ, అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి స్థల పరిశీలన చేశారు. రాప్తాడులోని ఆటో నగర్ సమీపాన స్థలాన్ని, రామినేపల్లి సమీపంలోని ఎంఐజీ లేఅవుట్‌ను, ప్రసన్నాయపల్లి సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. వీరి వెంట అనంతపురం నగరపాలక మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్‌రెడ్డి, అనంతపురం జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, పార్టీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, నాయకులు చిట్రా వెంకటేష్, కాంట్రాక్టర్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం చేయబోతే అంతమొందించింది!

ధర్మవరం రూరల్: తనపై అత్యాచార యత్నం చేసిన వ్యక్తిని ఓ మహిళ రోకలి బండతో మోదింది. తీవ్రగాయాలైన ఆ వ్యక్తి ఆస్పత్రిలో ప్రాణాలు విడిచాడు. సీఐ అశోక్‌కుమార్ తెలిపిన మేరకు.. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన బొగ్గ ప్రతాప్ (35), కేతిరెడ్డి కాలనీకి చెందిన స్నేహలతలు ఒకే కళాశాలలో ఇంటర్ చదివారు. కొంతకాలం క్రితం బొగ్గ ప్రతాప్ భార్య మృతి చెందింది. ఈ క్రమంలోనే ప్రతాప్ కేతిరెడ్డి కాలనీలో ఉన్న స్నేహలత ఇంటికి వెళ్లేవాడు. ఆమె భర్త, కుటుంబ సభ్యులు మందలించినా ప్రతాప్ ప్రవర్తనలో మార్పు రాలేదు. ఆదివారం కూడా మద్యం సేవించి స్నేహలత ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఆమె భర్త ఇంట్లో లేడు. దీంతో ఆమెను బలాత్కారం చేయబోగా.. ఆగ్రహించిన స్నేహలత రోకలి బండతో ప్రతాప్ తలపై మోది అక్కడి నుంచి వెళ్లిపోయింది. విషయంపై స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. రక్తపు మడుగులో ఉన్న ప్రతాప్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి ఒక కుమార్తె ఉంది. స్నేహలతను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

సాయి తత్వం.. ప్రేమ మయం



'సాయి మాటే..ప్రేమ బాట' నృత్య రూపకంలోని సన్నివేశం

- ప్రశాంతి నిలయంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



జీవనోపాధుల కిట్లను పంపిణీ చేస్తున్న రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఉమ్మడి కరీంనగర్ భక్తులు ఆదివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహా సమాధి చెంత పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సత్యసాయిని కీర్తిస్తూ సంగీత విభావరి నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు దంపతులు కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన భక్తులకు జీవనోపాధులకు ఉపయోగపడే టైలరింగ్ యంత్రం, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్ కిట్లను పంపిణీ చేశారు.సాయంత్రం బాలవికాస్ చిన్నారులు 'సాయి మాటే..ప్రేమ బాట' పేరుతో సంగీత నృత్యరూపకం ప్రదర్శించారు. సత్యసాయి మహిమాన్విత ఘట్టాలను అత్యద్భుతంగా వివరించారు.

ఉందామా... పోదామా!

జిల్లా తెలుగుదేశం పార్టీ నేతల్లో అయోమయం.. గందరగోళం నెలకొంది. ఉందామా... పోదామా అన్న విషయం తేల్చుకోలేని పరిస్థితుల్లో చిక్కుకుపోయారు. రాజకీయంగా తమ భవిష్యత్ ఏమిటో అర్థం కాక సందిగ్ధంలో పడిపోయారు. అధికార పార్టీ వైఎస్సార్ సీపీ నేతలు జనంతో మమేకమవుతూ ఊరూవాడా తిరుగుతుండగా..టీడీపీ నేతలు మాత్రం టికెట్ వస్తుందా.. రాదా..అన్న ఆలోచనలో మునిగిపోయారు. – కదిరి



- టికెట్లపై ఇప్పటికీ తేల్చని చంద్రబాబు
- కొందరికి టికెట్లు గల్లంతంటూ ప్రచారం
- ధర్మవరం, పుట్టపర్తి స్థానాలపై జనసేన ఆశలు
- అంతర్మథనంలో టీడీపీ సీనియర్లు
- ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణలో మరికొందరు

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలోనూ టీడీపీ నేతలు ఇళ్లకే పరిమితమయ్యారు. అధినేత చంద్రబాబు ఎటూ తేల్చకపోవడంతో ఎటు వెళ్లాలో తేల్చుకోలేక సతమతమవుతున్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హిందూపురం పార్లమెంట్ స్థానంతో పాటు జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తల పేర్లు ప్రకటించారు. వారంతా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ప్రజల్లో తిరుగుతున్నారు. ఇది టీడీపీ నాయకులకు మింగుడు పడటం లేదు. చంద్రబాబు అభ్యర్థుల జాబితాను ఎప్పుడు ప్రకటిస్తారు? ఇంతకీ తమకు టికెట్ వస్తుందా? రాదా? ఒకవేళ టికెట్ రాకపోతే తమ రాజకీయ భవితవ్యం ఏమిటి? అని టీడీపీ సీనియర్లు అంతర్మథనంలో పడ్డారు. తమకు టికెట్ దక్కని పక్షంలో పార్టీ అభ్యర్థులను ఓడించడం ఖాయమని కొందరు అంటుండగా..మరికొందరు మాత్రం పార్టీని వీడేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుని ఉన్నారు.

అందరిదీ అదే టెన్షన్

- పుట్టపర్తి నియోజకవర్గంలో టీడీపీ టికెట్ దాదాపుగా తనకే దక్కుతుందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పైకిచెబుతున్నప్పటికీ లోలోన బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటివరకూ అధిష్టానం నుంచి ఎలాంటి హామీ రాకపోవడం, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప సైతం పుట్టపర్తి సీటు ఆశిస్తుండడంతో పల్లె భయానికి కారణంగా తెలుస్తోంది. ఇంకోవైపు ధర్మవరానికి చెందిన వరదాపురం సూరి పేరు కూడా బాగా వినిపిస్తోంది. ఇక తాజాగా కదిరి పట్టణానికి చెందిన బ్లూమూన్ విద్యాసంస్థ అధినేత శివశంకర్ ఈ మధ్యే జనసేన పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఆయన కూడా పొత్తులో భాగంగా పుట్టపర్తి ఎమ్మెల్యే టికెట్ జనసేన తరఫున తనకే దక్కుతుందనే ధీమాతో ఉన్నారు. అదే జరిగితే 'పల్లె' పార్టీని వీడేది ఖాయమని ఆయన అనుచరులు అంటున్నారు.
- కదిరి నియోజకవర్గంలో కందికుంట వెంకటప్రసాద్ పేరును ఇప్పటికే చంద్రబాబు ప్రకటించినా, నకిలీ డీడీల కేసు ఆయన్ను వెంటాడుతోంది. దీంతో ఈసారి ఎన్నికల్లో ఆయన భార్య యశోదమ్మకు టికెట్ ఇవ్వాలని కందికుంట అనుచరులు కోరుతున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా మైనార్టీ కోటాలో ఈసారి కదిరి టికెట్ తనకే దక్కుతుందనే నమ్మకంతో ఉన్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు ఇప్పటికే కొంత డబ్బు కూడా డిపాజిట్ చేసినట్లు తెలుస్తోంది. అదే జరిగితే కందికుంట పార్టీని వీడేది ఖాయమని కొందరంటున్నారు.
- ధర్మవరం టీడీపీ టికెట్ ఈసారి తనకేనని బీజేపీలో ఉన్న వరదాపురం సూరి చెబుతుండగా, ఇప్పటి దాకా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న తన పరిస్థితి ఏమిటని పరిటాల శ్రీరామ్ ఆగ్రహిస్తున్నారు. వరదాపురానికే ఇక్కడ టికెట్ ఇస్తే ఆయన్ను ఓడించడం ఖాయమని శ్రీరామ్ వర్గం అంటోంది. మరోవైపు పొత్తులో భాగంగా ధర్మవరం టికెట్ జనసేనకు కేటాయిస్తారని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. తమ నాయకుడికి ధర్మవరం టికెట్ ఇవ్వకపోతే టీడీపీకి ధర్మవరంలో పుట్టగతులు ఉండవని వరదాపురం సూరి అనుచరులతో పాటు శ్రీరామ్ అనుచరులు కూడా కొందరు బహిరంగంగా హెచ్చరిస్తున్నారు.
- పెనుకొండ అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ తరఫున ఈసారి బీకే పార్థసారథి బదులు సవితమ్మకు కేటాయించే అవకాశముందని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. ఈసారి బీకేను హిందూపురం పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయించాలనే ఆలోచనలో టీడీపీ అధిష్టానం ఉన్నట్లు ఆ పార్టీ నేతలు అంటున్నారు. ఇందుకు బీకే సుముఖంగా లేరు. ఇదే విషయాన్ని ఆయన ఇటీవల నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో తేల్చిచెప్పారు. పెనుకొండ నుంచి తానే పోటీ చేస్తున్నానని ప్రకటించుకున్నారు.
- మడకశిర నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వ్ చేయడంతో ఇక్కడ టీడీపీ తరఫున ఈరన్న లేదా ఆయన కుమారుడు బరిలో దిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వారిరువురిలో ఎవరికి టికెట్ ఇచ్చినా ఓడించడం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అనుచరులు హెచ్చరిస్తున్నారు.
- హిందూపురం అసెంబ్లీ టీడీపీ టికెట్ సిట్టింగ్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకే దాదాపుగా ఖరారు చేశారని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. అయితే పార్టీ అధినేత చంద్రబాబు కుప్పంతో పాటు రెండో స్థానం హిందూపురం నుంచి కూడా పోటీ చేయవచ్చని మరికొందరు టీడీపీ నేతలు చెబుతున్నారు. మరోవైపు ఇక్కడ టీడీపీ టికెట్ ఎప్పుడూ స్థానికేతరులకేనా అని సొంత పార్టీ నాయకులే కొందరు విమర్శిస్తున్నారు.

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలికి సన్మానం



కేక్ కట్ చేస్తున్న కమలమ్మ

రొద్దం: మండలంలోని పెద్దగువ్వలపల్లికి చెందిన ఈడిగ కమలమ్మకు వందేళ్లు పూర్తి కావడంతో ఆదివారం ఆమె పుట్టిన రోజును కుటుంబసభ్యులు ఘనంగా నిర్వహించి, సన్మానించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులతో పాటు పలువురు గ్రామస్తులు ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు.

రైలు కిందపడి బేల్దారి మృతి



ఎర్రిస్వామి (ఫైల్)

పామిడి: రైలు కిందపడి ఓ బేల్దారి మృతిచెందాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు... పామిడిలోని నాగిరెడ్డి కాలనీకి చెందిన వడ్డే ఎర్రిస్వామి (47) బేల్దారి పనులతో జీవనం సాగించేవాడు. అవివాహితుడైన ఆయన కొన్ని రోజులుగా మతిస్థిమితం లేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీ ఇంటి నుంచి బయటకెళ్లిన ఎర్రిస్వామి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం స్థానిక ఎద్దులపల్లి మార్గంలోని రైలు పట్టాలను ట్రాక్‌మెన్ పరీక్షిస్తూ వెళుతుండగా సత్రం సమీపంలో దుర్వాసన వస్తుండడం గమనించి పరిశీలించాడు. పట్టాల పక్కన గుంతలో కుళ్లిన స్థితిలో ఉన్న పురుషుడి మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న ఎర్రిస్వామి కుటుంబసభ్యులు అనుమానంతో అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతుడిని ఎర్రిస్వామిగా నిర్ధారించారు. ఘటనపై మృతుడి తల్లి వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి



సునీత మృతదేహం

గుంతకల్లు రూరల్: విద్యుత్ షాక్‌కు గురై ఓ వివాహిత మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన కురుబ నాగార్జున, సునీత (30) దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆటో డ్రైవర్‌గా నాగార్జున, కూలి పనులతో సునీత కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌లోకి వెళ్లిన సునీత లైట్ స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై కుప్పకూలింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు.

‘సూక్ష్మ’ సేద్యం.. రైతుకు భాగ్యం



ఈ రైతు పేరు నారాయణస్వామి. వీరిది బుక్కపట్నం మండలం గూనిపల్లి. ఈయనకు 4.5 ఎకరాల భూమి ఉంది. గతంలో బోరు నీళ్లు పారించి పంటలు పండించేవారు. అయితే ప్రభుత్వం సబ్సిడీపై స్ప్రింక్లర్లు, డ్రిప్పు పరికరాలను అందించడంతో డ్రిప్పు అమర్చి పంటలను సాగు చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. డ్రిప్పు ద్వారా నీటి వృథా తగ్గి, సమయం కూడా కలిసి రావడంతో పంటలతో పాటు ఇతర పనులకు సమయం కలిసివస్తోందని నారాయణస్వామి హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ మేలును ఎన్నటికీ మరువలేమన్నారు.



- సబ్సిడీపై రైతులకు డ్రిప్పు పరికరాలు
- ఐదేళ్లలో 39,647 మందికి లబ్ధి
- రూ.254.54 కోట్లను ఖర్చు చేసిన ప్రభుత్వం
- ప్రభుత్వమేలును మరువబోమంటూ అన్నదాతల హర్షం

పుట్టపర్తి అర్బన్: రైతువేసే ప్రతి అడుగులోనూ రాష్ట్ర ప్రభుత్వం తోడుగా నిలుస్తోంది. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులతో పాటు యంత్ర పరికరాలూ అందుబాటులోకి తెచ్చింది. అలాగే బిందు, తుంపర సేద్యం చేసే వ్యవసాయ, ఉద్యాన రైతులకు సబ్సిడీపై పరికరాలు అందజేస్తోంది. దీంతో రైతులు తక్కువ నీటితోనే పంటలు సాగుచేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

39,647 మందికి లబ్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మొత్తం 39,647 మంది రైతులకు 46,057 హెక్టార్లకు సబ్సిడీపై డ్రిప్పు, స్ప్రింక్లర్ పరికరాలు అందజేశారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఈ పథకాన్ని ప్రారంభించగా.. మొత్తం 18 సంవత్సరాల్లో 1,11,431 మంది రైతులకు 1,23,599.94 హెక్టార్లకు సరిపడా పరికరాలను అందజేశారు. వీటన్నింటినీ ఉద్యాన తోటలతో పాటు కూరగాయలు, ఆకుకూరలు, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలకు వినియోగిస్తున్నారు.

నీటి వృథాకు చెక్

జిల్లాలోని రైతులు వేసవి సమయంలో ఉద్యాన పంటలతో పాటు కూరగాయలు, పండ్ల తోటలు, ఖర్బూజా, దోస, కలింగర తదితర పంటలను సంరక్షించుకోవడానికి డ్రిప్పు, స్ప్రింకర్ పరికరాలను అధికంగా వినియోగిస్తారు. నీటి లభ్యత తగ్గినా వాటి ద్వారా నీటి వృథాను అరికట్టి పంటలను సంరక్షించుకోవడానికి ఉపయోగిస్తున్నారు.

రాయితీ ఇలా...

ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు 90 శాతం, 5 నుంచి 10 ఎకరాలల్లోపు భూమి ఉన్న రైతులకు 70 శాతం రాయితీతో డ్రిప్పు పరికరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయి. అలాగే ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు 55 శాతం, 5 నుంచి 10 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు 45 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్ పరికరాలు ఇస్తున్నారు. సాధారణంగా డ్రిప్, స్ప్రింక్లర్‌లను 7 సంవత్సరాల నుంచి పదేళ్ల వరకూ వినియోగించవచ్చు. ఆపైన ప్రభుత్వం మరోసారి సబ్సిడీపై పరికరాలను అందజేస్తుంది.

అద్భుతాలు సృష్టించొచ్చు



డ్రిప్పు ద్వారా తక్కువ నీటితో అధిక పంటలను విస్తారంగా సాగు చేసి అద్భుతాలు చేయవచ్చు. డ్రిప్పు చాలా ఉపయోగకరం. ఒక్కసారి ఏర్పాటు చేసుకుంటే సుమారు పదేళ్ల పాటు పంటలను సాగు చేయవచ్చు. మంచి దిగుబడులు సాధించవచ్చు. ఒక ఉద్యాన తోటలే కాదు ఇతర పంటలను కూడా సులువుగా సాగు చేయవచ్చు.

– మంజుల, అగ్రహారం, బుక్కపట్నం మండలం

సబ్సిడీతో ఊరట



ప్రభుత్వం సూక్ష్మ సేద్య పరికరాలకు అందిస్తున్న సబ్సిడీ రైతులకు ఎంతో ఉపయోగకరం. బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తే లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుంది. మార్కెట్‌లో కన్నా ఎంతో నాణ్యమైన పరికరాలను ప్రభుత్వం సబ్సిడీతో అందజేస్తుండటం హర్షణీయం. ఆర్‌బీకేలో నమోదు చేయగానే అధికారులు, డీలర్లు వచ్చి అనతి కాలంలోనే డ్రిప్పు పరికరాలను ఇస్తున్నారు.

– బ్రహ్మానందరెడ్డి, బుక్కపట్నం

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



సూక్ష్మ సేద్య పరికరాలను ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలి. ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగులో చేపట్టిన ఈక్రాప్ నమోదులో డ్రిప్, స్ప్రింక్లర్ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి. లెక్క తేలిన తరువాత ప్రతి రైతుకూ పరికరాలను అందించడానికి వీలవుతుంది. ఐదేళ్లలో 39,647 మంది రైతులు 46,057 హెక్టార్లకు సుమారు రూ. 254.54 కోట్ల విలువైన పరికరాలను అందించాం.

– సుదర్శన్, పీడీ, ఏపీఎంఐపీ

జనవాక్కు

ఆర్థిక ఇబ్బందులు దూరం



గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగనన్న నెరవేర్చారు. మహిళా సంఘాల రుణాలన్నీ మాఫీ అయ్యాయి. నాకూ వైఎస్సార్ ఆసరా కింద రూ.64 వేల లబ్ధి చేకూరింది. కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. నా భర్త సహకారంతో రూ.1.50 లక్షల బ్యాంక్ రుణం తీసుకుని చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకున్నా. గతంలో చంద్రబాబు అబద్ధపు హామీలు నమ్మి మోసపోయాం. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎవరెన్ని కుట్రలు చేసినా మా మద్దతు మాత్రం జగనన్నకే.

– నాగలక్ష్మి, రాయచోటి రోడ్డు, కదిరి

పిల్లల పెళ్లి చేయగలిగాం



మాది సాధారణ మధ్య తరగతి కుటుంబం. నేను, నా భార్య, ఇద్దరు కుమార్తెలు, మా అమ్మ సాతున్ బీ... అందరమూ కలిసే ఉంటున్నాం. చిల్లర వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయంతో అతి కష్టంపై కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు మా కుటుంబాన్ని ఎంతగానో ఆదుకున్నాయి. ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. నా భార్యకు బ్యాంక్ రుణం మాఫీ అయింది. డ్వాక్రా సంఘంలో రుణం తీసుకుని పిల్లల పెళ్లి చేయగలిగాం. ఇంత గొప్ప సీఎంను ఇప్పటి వరకూ నేను చూడలేదు. మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాం.

– రియాజ్, చిలమత్తూరు

బతుకులు బాగుపడ్డాయి



వైఎస్సార్ ఆసరా పథకం కింద సంఘంలో ఉన్న నా రుణం మాఫీ అయింది. నా భర్త బాబ్జాన్ సహకారంతో బ్యాంక్ ద్వారా రూ.1.50 లక్షలు రుణం తీసుకుని దుస్తుల దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నా. ఇప్పుడు మా పరిస్థితి ఎంతో బాగుంది. బతుకులు బాగుపడ్డాయి. జగనన్న చేసిన మేలు మరువలేం. మళ్లీ జగనన్నే సీఎం కావాలని కోరుకుంటున్నాం.

– నాజీయా, మశానపేట, కదిరి

10న యువ న్యాయవాదుల సదస్సు

- హాజరు కానున్న ముగ్గురు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆరుగురు హైకోర్టు న్యాయమూర్తులు

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) వేదికగా ఈ నెల 10న యువ న్యాయవాదుల సదస్సు (వర్క్‌షాప్ ఫర్ యంగ్ అడ్వకేట్స్) నిర్వహించనున్నారు. ఈ మేరకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఎ.రామిరెడ్డి ఆదివారం తెలిపారు. ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, విశిష్ట అతిథులుగా సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, మరో జడ్జి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి హాజరుకానున్నారు. అలాగే ప్రత్యేక ఆహ్వానితులుగా ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్‌ఠాకూర్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్‌కుమార్ మిశ్రా, ఏపీ హైకోర్టు జడ్జిలు జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, జస్టిస్ కె.మన్మథరావు, జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ బి.శ్యామసుందర్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ చైర్మన్ ఎస్.ప్రభాకరన్, ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ అపూర్వకుమార్ శర్మ, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, వైస్ చైర్మన్ రామజోగేశ్వర రావు, అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విశ్వనాథరెడ్డి హాజరు కానున్నారు. ఒకే సదస్సుకు సుప్రీంకోర్టు జడ్జిలు ముగ్గురు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆరుగురు హైకోర్టు న్యాయమూర్తులు హాజరుకావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ‘సివిల్ ప్రొసీజర్ కోడ్ విత్ స్పెషల్ రెఫరెన్స్ టు డిస్పోజల్ ఆఫ్ ఇంటర్లొక్యూటోరీ అప్లికేషన్స్’ అనే అంశంపై ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. అలాగే ‘రిలవెన్స్ ఆఫ్ అడ్మిషన్స్ అండ్ కన్ఫెషన్స్ ఇన్ ఏ క్రిమినల్ ట్రయల్’ అంశంపై ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గా ప్రసాద రావు, ‘అప్లికేషన్ ఆఫ్ ఎవిడెన్స్ ఇన్ క్రిమినల్ లా’ అంశంపై ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాస రెడ్డి, ‘ఇంపార్టెన్స్ ఆఫ్ ఎథిక్స్ ఇన్ లీగల్ ప్రొఫెషన్’ అంశంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, ‘ఎఫెక్టివ్ కోర్టు రూమ్ అడ్వొకసీ’ అంశంపై సుప్రీంకోర్టు జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ‘రూల్ ఆఫ్ లా అండ్ రోల్ ఆఫ్ అడ్వకేట్స్ ఇన్ బిల్డింగ్ ప్రాస్‌పెరస్ భారత్’ అంశంపై జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి అవగాహన కల్పించనున్నారు.

నేషనల్ ఫ్రిస్‌బీ టోర్నీ విజేత ఎయిర్ బెండర్స్



విజేత ఎయిర్‌బెండర్స్ జట్టు



రన్నరప్‌ను దక్కించుకున్న ఎయిర్‌బోర్న్ జట్టు

అనంతపురం: నేషనల్ ఫ్రిస్‌బీ టోర్నీ విజేతగా బెంగళూరుకు చెందిన ఎయిర్‌బెండర్స్ జట్టు నిలిచింది. అనంత క్రీడాగ్రామం వేదికగా అల్టిమేట్ ఫ్రిస్‌బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బెంగళూరుకు చెందిన ఎయిర్ బెండర్స్ వన్, ఎయిర్‌బోర్న్ జట్లు తలపడ్డాయి. 15–13 పాయింట్ల తేడాతో ఎయిర్ బెండర్స్ జట్టు టైటిల్ గెలుచుకుంది. మొత్తం జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 200 మంది క్రీడాకారులు టోర్నీలో పాల్గొన్నారు. అల్టిమేట్ ఫ్రిస్‌బీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు పుండ్రీ కుమార్, అంతర్జాతీయ మాజీ క్రీడాకారిణి నిత్య, అల్టిమేట్ ఫ్రిస్బీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి దీపక్, మాజీ భారత్ కోచ్ నందన్ ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలను అభినందిస్తూ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పుండ్రీకుమార్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా జాతీయ స్థాయి ఫ్రిస్‌బీ టోర్నీ నిర్వహించేందుకు ఆర్డీటీ అద్భుతమైన సౌకర్యాలు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు.

సీనియర్ ఏపీఎల్ విజేత మడకశిర, అనంత





మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న అల్తాఫ్, యోగానంద

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా జరుగుతున్న సీనియర్ ఏపీఎల్ టోర్నీ విజేతగా అనంతపురానికి చెందిన ఫ్యామిలీ క్లబ్, మడకశిర క్రికెట్ క్లబ్ జట్లు నిలిచాయి. అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లో తొలుత అనంతపురం ఫ్యామిలీ క్లబ్, ఏడీసీఏ గుంతకల్లు జట్లు తలపడ్డాయి. నిర్ణీత 20 ఓవర్లలో ఫ్యామిలీ క్లబ్ జట్టు 9 వికెట్లు కోల్పోయి 176 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గుంతకల్లు జట్టు 20 ఓవర్లలో 162 పరుగులకే పరిమితమైంది. ఫ్యామిలీ క్లబ్ జట్టులో యోగానంద 42 బంతుల్లో 60 పరుగులు చేసి మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ దక్కించుకున్నాడు.

- మడకశిర క్రికెట్ క్లబ్, విక్కీ ఎలెవన్ జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విక్కీ ఎలెవన్ జట్టు 19.4 ఓవర్లలో 73 పరుగుల వద్ద చతికిలపడింది. అనంతరం బ్యాటింగ్ చేసిన మడకశిర జట్టు 11.4 ఓవర్లలోనే 75 పరుగులు చేసి విజయం సాధించింది. మడకశిర జట్టులో బౌలర్ అల్తాఫ్ కేవలం 8 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు దక్కించుకుని మ్యాచ్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కైవసం చేసుకున్నాడు.

యువకుడిపై హత్యాయత్నం

పావగడ: తాలూకాలోని తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బుగుడూరు గ్రామానికి చెందిన నారాయణరెడ్డిపై దుండగులు మారణాయుధాలతో దాడి చేశారు. శనివారం అర్ధరాత్రి గ్రామ శివారులోని తోటలో కాపాలకెళ్లి నిద్రిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. దాడి నుంచి తప్పించుకుని దాదాపు కిలోమీటరు దూరం పరుగెత్తుకెళ్లి ప్రాణాలు దక్కించుకున్న యువకుడిని స్థానికులు గుర్తించి హుటాహుటిన బెంగళూరులోని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ రామచంద్రప్ప, రూరల్ సీఐ గిరీష్... ఆదివారం ఉదయం బుగుడూరు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

రొద్దం: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం చెరుకూరు గ్రామానికి చెందిన కురుబ గంగాధరప్ప కుమారుడు ఆనంద్ (28) ఆదివారం సాయంత్రం కర్ణాటక నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. చెరుకూరు సమీపంలోకి చేరుకోగానే టింబక్ కార్యాలయం వద్ద పెనుకొండ వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆనంద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ముందుకెళ్లిపోయాడు. సమాచార అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

17 నుంచి కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలు



కొండపై వెలసిన శ్రీవారి మూలవిరాట్



ఉత్సవాలకు సిద్ధమైన కొండమీదరాయుని ఆలయం

- 24న కొండమీదరాయుని రథోత్సవం

బుక్కరాయసముద్రం: మండలంలోని కొండమీదరాయ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. కొండపైకి వెళ్లేందుకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి చొరవతో రూ.4 కోట్లు వెచ్చించి సిమెంట్ రోడ్డు వేశారు. రోడ్డుకు ఇరువైపులా హైమాస్ లైట్లు ఏర్పాటు చేశారు. 17న సాయంత్రం బీకేఎస్‌లోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయం నుంచి భూదేవి, శ్రీదేవి సమేత శ్రీవారి ఉత్సవ మూర్తులను కొండపైకి చేరుస్తారు. 18న ఉదయం 8 గంటలకు దేవరకొండపై ఉత్సవ మూర్తులకు పుణ్యాహవచనము, అంకురార్పణ, దేవతాహోమాలు, ధ్వజారోహణం, గరుడ ఆహ్వాన పూజలు ఉంటాయి. అదే రోజు రాత్రి 8గంటలకు పూలపల్లకీ సేవ ఉంటుంది. 19న రాత్రి 8గంటలకు సింహ వాహనం, 20న రాత్రి 8గంటలకు శేష వాహనం, 21న రాత్రి 8గంటలకు హనుమద్వాహన సేవలు ఉంటాయి. స్వామి వారి వాహన సేవల్లో అత్యంత కీలకమైన గరుడ వాహన సేవను ఈ నెల 22న రాత్రి 8 గంటలకు నిర్వహించనున్నారు. 23న రాత్రి 8గంటలకు శ్వేతగజ వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమివ్వనున్నారు.

24న కల్యాణోత్సవం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులందరూ ఎంతో ఉత్కంఠగా ఎదురు చూసే కల్యాణోత్సవాన్ని ఈ నెల 24న వేకువజాము 4 గంటలకు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 11.30 గంటలకు సూర్యప్రభ వాహనంపై దేవేరులతో కలసి శ్రీవారు ఊరేగనున్నారు. గరుడాద్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణస్వామి ఆలయం నుంచి పురవీధుల గుండా ఎంతో అట్టహాసంగా ఈ ఊరేగింపు సాగనుంది. మధ్యాహ్నం బ్రహ్మరథోత్సవం ఉంటుంది. 25న రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపై ఊరేగిస్తారు. 26న ఉదయం 7గంటలకు తీర్థవాది వసంతోత్సవం నిర్వహించి రాత్రి7 గంటలకు హంస వాహన సేవలు ఉంటాయి.

వృద్ధుడి బలవన్మరణం



మృతుడు సుబ్బరాయుడు

గార్లదిన్నె: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం అనగానదొడ్డికి చెందిన సుబ్బరాయుడు(64) గార్లదిన్నె మండలం పెనకచెర్ల డ్యామ్‌కు చెందిన లక్ష్మీదేవిని పెళ్లి చేసుకున్నాడు. పెనకచెర్ల డ్యామ్‌లోనే స్థిరపడి వ్యవసాయంతో జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో గుత్తిలో స్థిరపడాలని నిర్ణయించుకున్న ఆయన ఇటీవల అక్కడ ఇంటి నిర్మాణ పనులు చేపట్టాడు. రెండు రోజుల క్రితం భార్య లక్ష్మీదేవితో గొడవపడిన ఆయన శనివారం నేరుగా పెనకచెర్లడ్యామ్‌కు చేరుకుని తన తోటకెళ్లి మద్యంలోకి పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన రైతులు గుర్తించి సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని సుబ్బరాయుడు మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జాతీయస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



వినీత్‌తో పాఠశాల ఉపాధ్యాయులు

పరిగి: గత నెల 27, 28 తేదీల్లో మహారాష్ట్రలోని పూణేలో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో పరిగి మండలం కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థి వినీత్ ప్రతిభ చాటి తృతీయ స్థానంలో నిలిచాడు. ఆదివారం ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వినీత్‌ను ప్రిన్సిపల్ మురళీధర్‌బాబు, ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ యోగా శిక్షకుడు శ్రీనివాసమూర్తి, ఆయుర్వేద డాక్టర్ లావణ్య, అసిస్టెంట్ ప్రిన్సిపల్ ప్రమీలమ్మ, పీడీ షబానా తదితరులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి మృతి

కుందుర్పి: మండలంలోని అల్లాపురం-కనుకూరు రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో కర్ణాటకకు చెందిన వాసుపాల్‌శర్మ(45) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని కొర్లకుంట గ్రామం నుంచి బసాపురం గ్రామంలోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంలో చేరుకున్న వాసుపాల్ శర్మ ఆదివారం తిరుగు ప్రయాణమయ్యారు. అల్లాపురం గ్రామం దాటిన తర్వాత ఎదురుగా బైక్‌పై దూసుకొచ్చిన శెట్టూరు మండలం కనకూరు గ్రామానికి చెందిన సురేష్ ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన వాసుపాల్‌శర్మను స్థానికులు వెంటనే కర్ణాటకలోని చిత్రదుర్గం ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందారు. ఘటనపై కుందుర్పి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.